నూతనాధ్యాయము

రచన:
శ్రీ. దేశాయ్

ఆమె పుట్టినరోజునే-ఆ మరుక్షణంలోనే - మేనత్త కొడుకైన అరవిందునితో ఆమె వివాహం నిశ్చయమైంది. కుటుంబ ఆచార సాంప్రదాయాలను అనుసరించి. తనకు నచ్చినా నచ్చకపోయినా-అతడు తనమేనమామ కుమార్తెనే వివాహం చేసుకోవాలి. మేనమామకు స్త్రీసంతానం లేనప్పుడుమాత్రమే పై సంబంధం గురించి ఆలోచించడానికి వీలుంటుంది. ఆచారసాంప్రదాయాలు అపురూపంగానే తోచవచ్చు. చిత్రవిచిత్రంగానేవుండవచ్చు. అతడికి అసహ్యం వేసింది. ఎక్కడో విదేశాలలోనున్న ఆమె కూడా అతడికి అసహ్యంగా తోచింది. అయినా అతడు చేయగలిగిందేమీలేదు. ఆనాడే తన తల్లిమాట యిచ్చింది. తలిదండ్రుల మాటను నిలబెట్టకపోతే వారి అగ్రహోశాలకు గురికావలసిందే!

తనకు కాబోయే భార్య-సుధ - జన్మించిన రెండు మాసాలికే భారతదేశం వదలి తలిదండ్రులతో ఎక్కడో దూరానవున్న సింగపూరు వెళ్లిపోయింది. అక్కడే పెరిగి పెద్దదైంది. ఈనాడు ఆమె అందాల భరిణె. పైగా చదువు సంస్కారములుగలది, ఆమె ముఖం ఎలా వుండేదో కూడా అతడికిప్పుడు గుర్తులేదు. ఈనాడామె ఎలావుందో ఊహించుకోలేదు. పద్దెనిమిది సంవత్సరాల క్రితం-తాను ఆరేళ్లకుర్రాడు-రెండుమాసాల పసికందు-సుధ-ప్రపంచాన్నే మరచి ప్రశాంతంగా ఉయల్లో నిద్రపోతూంటే ఒక్కసారి తొంగిచూచాడు ఆ ముఖాన్ని అంతే తరువాత ఆమె విషయమే మరచిపోయాడు. ఇప్పుడు ఆలోచించడం మొదలు పెట్టాడు. ఊహించుకుంటున్నాడు. పలువిధాల తన కళ్లముందు చిత్రించుకుంటున్నాడు. ఆమె మేనమామ ఫొటోఒకటి పూనాలో తన ఇంట్లోవుంది. ఆయనలాగే ఆమెకూడా అంత అందవికారంగానూ వుంటుందేమో! ఆమె అత్తయ్య పోలికలు ఆమెలోవున్నా రూపురేఖలు బాగానే వుండవచ్చు. ఈతని జీవిత సమస్యను తనకు తెలియకుండానే యీ విధంగా పరిష్కరించివేస్తే?

కాబోయే అత్తమామలు వారి ఒక్కగాని ఒక్క కూతురు ఆనాడు సింగపూరునుండి వస్తున్నారు. బొంబాయి నుండి వారిని తీసుకురావడానికి బయలుదేరాడు. దక్కను క్వీను బొంబాయి చేరగానే ఎందాకో అతడి శరీరం ఒక్కసారి జలదరించింది. ఏదో వింతగా తోచింది. సుధ ఎలావుంటుందో!

అరవిందుడు మెకానికల్ ఇంజనీరు. బీహారులో పని చేస్తున్నాడు. ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం యిచ్చి పూనాకు రప్పించారు తలిదండ్రులు ఎందుకో అర్థంకాలేదు. వెంటనే శలవు తీసుకుని హడావిడిగా వచ్చాడు. తాము నిర్ణయించిన పిల్లనే వివాహమాడాలని తలిదండ్రులు చెప్పేసరికి అతడికి ఆశ్చర్యంవేసింది. ఆమెను తానెప్పుడూ చూడలేదే! రెండుమాసాల పసికందుగా వెళ్లి మళ్లీ యింతవరకూ భారతగడ్డపై ఆమె అడుగు పెట్టలేదే! ఏమిటీ శాసనం? తలిదండ్రుల యీ పనికి అతడికి అసహ్యం వేసింది. తన అయిష్టతను వారికి అసందిగ్ధంగా తెలిపాడు. అవసరమైతే ఇంట్లోంచి వెళ్లిపోతానన్నాడు. కాని వృద్ధులైన తలిదండ్రులు బ్రతిమిలాడారు. ఆఖరికి కొంత సమాధానానికివచ్చి, పిల్లను చూచిన తరువాతనే తన తుది నిర్ణయం చెప్పడానికి అంగీకరించాడు.

ఆనాడు రాబోయే వారిని తీస్కురావడానికి బొంబాయి వెళ్లిన అరవిందుడు వారిని చూడగానే తనకళ్లను తానే నమ్మలేకపోయాడు, ఆమె తన ఊహాగానానికి ఎక్కడా అందలేదు. యౌవ్వనంతో మిలమిలలాడుతూ ప్రకృతిలోని సౌందర్యమంతా మూర్తీభవించిన సుందరమూర్తా అన్నట్లువుంది సుధ. చిరునవ్వులు చిందులాడే ఆ చిన్నారి ముఖము, ఆ వయ్యారములోని ఆమె వంపుసొంపులు అతణ్ణి అమాంతంగా బంధించివేశాయి. అంతేగాదు. బాధ్యతాయుతమైన ఆమె నడవడి, ముచ్చటగొలిపే ఆమె ముద్దు పలుకులు అతణ్ణి ఆనందపరిచాయి. తలిదండ్రుల ప్రేమాభిమానాలలో పెరిగి పెద్దదై విద్యావంతురాలైన ప్రతిభారత వనితకు వుండే నమ్రత, అణకువ, బిడియము ఆమెలో కన్పించాయి. అతణ్ణి చూడగానే-అతడే తనకు కాబోయే భర్తని ఆమె గ్రహించింది. ఆమె అంత స్వంతంత్రచూపకపోయినా చనువుగానే వ్యవహరించింది. పూనా వచ్చిన కొద్దిరోజుల్లోనే వారి వివాహం జరిగింది.

కూతురుని అల్లుణ్ణి తమతోకూడా మలయాకు తీసుకు



వెడదామనుకున్నారు సుధ తలిదండ్రులు అక్కడే కౌలాలంపూరులో సుధ తండ్రికి కాంట్రాక్టు సంస్థవుంది. ఇంజినీరింగు కట్టడాలు బాగా తెలిసిన అరవిందుడు తన వద్ద వుంటే తన సంస్థబాగా అభివృద్ధిచెందుతుందని అతడు ఆశించాడు. పైగా అతడికి కొడుకులు లేరు. ఒక్కగాని ఒక్కకూతురు. ఆ పరిస్థితులలో అందరి తండ్రులలాగే అతడుకూడా తన కూతురును తనవద్దనే వుంచుకుందామని ఆశించాడు. అందుకు అరవిందుని తలిదండ్రులు మొదట అంగీకరించకపోయినా ఆఖరికి అతి కష్టంమీద ఒప్పుకున్నారు.

మలయాలో అరవిందుని జీవితం శత సహస్ర పుష్పాలుగా వికసించింది. తనవృత్తిలో సాటిలేని మేటిగా విజయాన్ని సాధించాడు. పేరు ప్రఖ్యాతులతోబాటు సిరిసంపదలుకూడా వృద్ధినొందాయి. జీవితాన్ని అత్యుత్తమంగా జీవించాడు. ఇంతలోనే మేనమామ చనిపోయాడు. అన్నివిధాల అభివృద్ధిచెందిన మామగారి ఇంజినీరింగుసంస్థ తన ఆస్తిగా మిగిలింది. తన ఒక్క కొడుకు గోవిందుని పెంచి పెద్దచేసిన అత్తగారుకూడ ఆ తర్వాత కొద్దికాలానికే కన్ను మూసింది. ఇన్నిసంవత్సరాలలోను ఒక్కసారిమాత్రమే అరవిందుడు భార్యాసమేతంగా ముసలివారైన తలిదండ్రులను చూడ్డానికి భారతదేశం వచ్చాడు. అప్పుడే 1936 లో రెండుమాసాల వ్యవధిలో తలిదండ్రులు చనిపోయారు. వారి అవసానకాలంలో అతడు వారిప్రక్కనే వుండగలిగాడు.

1938 నుండి అరవిందుని దురదృష్టదేవత ఆవహించింది. అత్తగారు కన్నుమూసింది. నెలలతరబడి భార్య జబ్బుతోపడి ఎంత చికిత్స చేయించినా ఆఖరికి ఆమె అంతరించింది. ఇంతలో ప్రపంచయుద్ధం వచ్చింది. ఆ యుద్ధంతోబాటు అతడి వ్యాపారం కూడా అభివృద్ధి చెందింది. దేశాన్ని జపానువారు ఆక్రమించుకున్నారు. జపానువారి ఆక్రమణలో వుండగానే అతడి వ్యాపారం మందగించింది. అంతవరకు సంపాదించినదంతా నష్టపోయాడు. ఆఖరికి ఆ అల్లకల్లోలంలో బాంబు పడి అరవిందుడు మరణించాడు.

యుద్ధం ముగిసింది. గోవిందుడు ఏకాకి. రోజు గడవడానికి కష్టమై అతడి జీవితం దుర్భరమైంది. తండ్రి మరణం తర్వాత మిగిలినదాన్ని కాస్త కూడబెట్టుకుని, నూతన జీవితం ప్రారంభించడానికై 1947 లో బయల్దేరి భారతదేశం వచ్చేశాడు. పూనాలోవున్న తాతగారి ఇల్లు తనకు మిగిలింది. అందువల్ల అక్కడే చిన్న తరహా ఇంజినీరింగు సంస్థను నెలకొల్పాడు. డబ్బుకోసం ఎంతో యిబ్బంది పడేవాడు. ఐనా అతడు ధృఢసంకల్పమున్నవాడు. వయస్సు ఇరవైయైదైనా యింకా వివాహం కాలేదు. ధైర్యంతో అన్ని అడ్డంకులను అధిగమిస్తూ అతి కష్టంమీద తనవృత్తిని కొనసాగిస్తూ వుండేవాడు.

ఒకనాడు అత్యవసరంగా అతడికి డబ్బు కావలసి వచ్చింది. అందువల్లనే అతడు బొంబాయికి ప్రయాణమై వెళ్ళాడు. ఆనాడు అతడికి రెండువేలరూపాయలు

కావాలి. శతవిధాల ప్రయత్నించాడు. కాని ఫలించలేదు. ఇక మిగిలినదల్లా ఒక్కటే మార్గం-తన జీవిత భీమా పట్టాపై అప్పు తీసుకోవాలి. అందుకే బొంబాయిలో వున్న భీమా కంపెనీ కేంద్ర కార్యాలయానికి బయల్దేరాడు. తొందరగా చేయవలసినవన్నీ ముగించి డబ్బు తీసుకుందామనే ఆశించాడు.

తిన్నగా తనకు తెలిసిన ఉద్యోగి దగ్గరకువెళ్ళి అప్పు దరఖాస్తు పూర్తిచేసియిచ్చి తొందరగా డబ్బు వచ్చేలా చేయమని కోరాడు. అక్కడనుండివెళ్ళిన కాగితాల కోసం నిరీక్షిస్తూ యిద్దరూ అతడి గత చరిత్ర గురించి మాట్లాడుకోవడం ప్రారంభించారు.

'నాన్నగారు బ్రతికివుంటే నాకీనాడు యీ బాధలు వుండేవి కావు. కాని...యీ భీకర యుద్ధం చేస్తూన్న వ్యాపారాన్ని పడగొట్టడమేగాక, ఆఖరికి ఆయన్నుకూడ పొట్టపెట్టుకుంది', అన్నాడు గోవిందుడు నిస్పృహతో.

'ఆయన చనిపోయేసరికి డబ్బేమీ మిగల్చలేదుకి' అన్నాడా ఉద్యోగి.

'మిగిల్చినా అది అంత లెక్కలోది కాదు. ఉన్నదేదో తీసుకొని నేను వచ్చేను. దానితో జీవితం గడపడం దుర్లభం.'

'మీ నాన్నగారు జీవితాన్ని భీమా చెయ్యలేదు?'

'అదీ దురదృష్టకరమైనది. జీవిత భీమా అంటే ఆయనకు నమ్మకం లేదు. ఐనా జపానువారి ఆక్రమణకు కొద్ది మాసాలకు ముందు స్నేహితుడైన ఒక ఏజెంటును తృప్తి పరచడానికి ఒక పట్టా తీసుకున్నాడు. మొదటి సంవత్సరం ప్రీమియం కట్టిన తరువాత యిక తదుపరి ప్రీమియములు కట్టడానికి వీలు కలుగలేదు. నిజం చెప్పాలంటే ఆ కంపెనీనే మూసివేశారు. అందువల్ల పట్టా మురిగిపోయింది.'

'ఆక్రమణ తర్వాతే అతడు మరణించాడన్నావు.'

'అవును. జపానువారు ఆక్రమించిన రెండు సంవత్సరాల తరువాత నావద్ద యింట్లో అందుకు సంబంధించిన కాగితాలు అన్నీ వున్నాయి. అయినా లాభమేమిటి? చేయడానికి కేమీ లేదు. ఆ అధ్యాయం ముగిసింది.'

'ఏ కంపెనీ?'

'మీ కంపెనీయే' అన్నాడు గోవిందుడు నిరాశగా యెదుడివాని ముఖంలోకి చూస్తూ,

చూడు గోవింద్. ఒక్క నిమిషం ఆగు. ఈవిషయంలో యెక్కడో యేదో పొరబాటు జరిగివుండాలి. అయినా చూచి చేస్తాను ఉండు,' అంటూ ఆఉద్యోగి అందుకు సంబంధించిన కాగితాలకోసం కబురు పంపాడు. అది రాగానే అన్నిటిని పరీక్షగా చూచి గోవిందుని వైపు ఒక్క చిరునవ్వు విసిరాడు.

'చూడు గోవింద్. ఈ పట్టాకు విలువలేనదడం పొరపాటు, విదేశాలలో ఆక్రమిత ప్రాంతాలలో ఉన్న పట్టాదారులకు ప్రీమియములు కట్టుటలో కొన్ని మినహాయింపులు, ప్రయోజనాలు కల్పించబడ్డాయి. ఈ నిబంధనల ప్రకారం భీమాచేయబడిన మొత్తంలోనుండి మీ నాన్నగారు బ్రతికివుంటే చెల్లించవలసిన ప్రీమియం మొత్తాన్ని తగ్గించి మిగతను మీరు పొందవచ్చును. అందుకు కావలసన కాగితాలన్నీ పూర్తిచేయి. ఆయన మరణించినట్లుగా సర్టిఫికేటు, నీవే ఆయనకు ఏకైక వారసుడేవని రుజువు-చూపిస్తే యీ డబ్బు నీకు యివ్వడం కలుగుతుంది,' అన్నాడాయన నవ్వుతూ.

గోవిందుకు సహజంగా ఆశ్చర్యం వేసింది. వెంటనే పూనా వెళ్ళి అందుకు సంబంధించిన పత్రాలన్నీ తీసుకువచ్చి అన్ని విషయాలు రుజువు చేశాడు. ఏమీ విలువలేదనుకున్న పట్టామీదే అతడికి కావలసిన డబ్బు చేతికి అందింది.